

న్యూస్ బాక్స్

రైతుల ఖాతాల్లో రూ.7కోట్ల91 లక్షల జమ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 315 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి రూ.7 కోట్ల91లక్షల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 8వేల 50మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత 502 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని పేర్కొన్నారు.

సర్వే డాటా ఎంట్రీ పూర్తి

తాండూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డాటా ఎంట్రీ పూర్తయినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండలంలోని 10,110 కుటుంబాల డాటా ఎంట్రీ పూర్తి చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జైపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్‌లో నూతన పరికరాల బిగింపు పనుల సందర్భంగా మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మనోహర్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాసంగికి సిద్ధం



నెన్నెల మండలం చిత్తాపూర్‌లో నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరి నారుమడి

- నారు మడులు రెడీ చేసుకుంటున్న రైతులు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- విత్తన వరిపై రైతుల ఆసక్తి
- అధిక దిగుబడులే లక్ష్యంగా ముందుకు
- పప్పు దినుసుల సాగు పెంచేలా అధికారుల కసరత్తు

నెన్నెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో సాగు పనులకు శ్రీకారం చుట్టారు. వరి నాడు మడులు వేసుకొని నాట్లు వేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. శనగలు, మక్కలు, మినుములు విత్తుకుంటున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో 1,24,292 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. ఇందులో 1.06లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని చెబుతున్నారు. ఈ సీజన్‌లో సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈ ఏడు పప్పుదినుసుల సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

● వరి సాగే ఎక్కువ...

యాసంగిలో వరి సాగుపైనే రైతులు మొగ్గు చూపిస్తున్నారు. గతేడాది యాసంగిలో 1,02,100 ఎకరాల్లో వరి సాగయింది. ఈ సీజన్‌లో జిల్లాలో 1,06,693 ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనాలు రూపొందించారు. 3,709 ఎకరాల్లో మక్క, 280 ఎకరాల్లో వేరుశనగ, 214ఎకరాల్లో పెసలు, 244 ఎకరాల్లో జొన్న, 145 ఎకరాల్లో మినుములు, 90 ఎకరాల్లో నువ్వులు, 95 ఎకరాల్లో శనగ, 12,822 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని అధికారులు చెబుతున్నారు. గతంలో యాసంగిలో 80 శాతం రైతులు దొడ్డు వరి రకాలను సాగు చేశారు. ఈ సారి సన్నాల సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో బోరుబావులు, ప్రాజెక్టుల ఆయకట్టుకు రైతులు సన్నాలు సాగు చేస్తామని చెబుతున్నారు.

● విత్తనాలు.. ఎరువులు రెడీ..

విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. సీజన్‌కు వివిధ పంటలకుగాను 34వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనాకు వచ్చారు. అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఎరువులను డీలర్లకు పంపించారు. యూరియా 14,645 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,966 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 11,563 మెట్రిక్ టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 4,436 మెట్రిక్ టన్నులు, జింక్ సల్ఫేట్ 1,030, ఎస్ఎస్‌పీ 2,023 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేశారు. అవసరాన్ని బట్టి మరిన్ని ఎరువులు తెప్పించుకునేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల నిల్వల సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

● పప్పు దినుసుల సాగు పెంచేలా...

పప్పు దినుసుల సాగు పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో జిల్లాలో భారీగా సాగైన పప్పు దినుసుల పంట క్రమంగా తగ్గుతూ వస్తోంది. వాణిజ్య పంటల వైపు రైతులు మళ్లడంతో పప్పుదినుసుల సాగుపై ప్రభావం పడింది. జిల్లాలో కంది, శనగ, పెసర, మినుము వంటి పప్పు దినుసులు విరివిగా పండించే వారు. ప్రస్తుత జనాభాతో పోల్చితే పండిస్తోంది అతి తక్కువ. అవసరానికి సరిపడ ఉత్పత్తి లేక పోవడంతో ...

మిగతా 7లో

వేధిస్తున్న కూలీల కొరత

- పంట చేలలోనే ఉన్న పత్తి
- వాతావరణ పరిస్థితులపై రైతుల్లో ఆందోళన
- పులి దాడులతో మరింత జంకుతున్న కూలీలు

6



ఆరుపదుల వయస్సులో అలుపెరుగకుండా...

- 2014లో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు
- ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ పలు సేవా కార్యక్రమాలు

7



శిక్షణ పొందే అభ్యర్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బీసీ రిజర్వేషన్‌ల సాధన కోసం సైకిల్ యాత్ర



మాట్లాడుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని ఈ నెల 6న ఐబీ చౌరస్తా నుంచి లక్షెట్టిపేట ఉత్కూరు చౌరస్తా వరకు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మంచిర్యాలలో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా 32 పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. సైకిల్‌యాత్రలో బీసీలు, కుల సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భీమ్‌సేన్, రమేష్, రాజు, వేణుగోపాల్, రాజేశం పాల్గొన్నారు.

రేపు నిరసన ర్యాలీ



మాట్లాడుతున్న హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్

గర్మిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 4న హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపడుతామని హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు. సోమవారం మంచిర్యాలలో ఆయన మాట్లాడుతూ ర్యాలీలో ధార్మిక, హిందూ సంస్థలు, అయ్యప్ప స్వాములు, అన్ని వ్యాపార వాణిజ్య సంస్థల యజమానులు పాల్గొని ఐక్యత చాటాలన్నారు. ర్యాలీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. నాయకులు బాపూజీ, తోట తిరుపతి, గుంటక సత్యనారాయణరెడ్డి, విష్ణు, మణికంఠ, సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల విష్ణు వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అందజేశారు. విష్ణు అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన నివాస గృహంలో రూ. 45వేల ఎల్‌వోసీ పత్రాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

పీజీ విద్యార్థులకు మెటీరియల్ అందజేత

బెల్లంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25 పీజీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సోమవారం మెటీరియల్ అందజేశారు. కళాశాలలో ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సులు నిర్వహిస్తుండగా కాకతీయ విశ్వవిద్యాలయం సూచించిన విధంగా ఆయా సబ్జెక్టుల సమాచారంతో కూడిన మెటీరియల్ విద్యార్థుల ప్రయోజనం అందజేసినట్లు ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ తెలిపారు. అధ్యాపకులు సునీల్‌కుమార్, పైడాకుల రవి, అల్లం తిరుపతి, సమ్మక్క , విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

నస్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వీఆర్ఏలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ కు అందించారు. నాయకులు మాట్లాడుతూ జీవో నెం.81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 80 రోజుల పాటు సమ్మె ఫలితంగా జీవో 81, 85లను విడుదల చేశారన్నారు. వీఆర్ఏల్లో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్ చదివిన వారికి రికార్డు అసిస్టెంట్లు, పదో తరగతి లోపు వారికి ఆఫీస్ సబార్డినేటర్స్ అవకాశాలు ఇస్తామని చెప్పారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు శాఖల్లో 16,758 వీఆర్ఏలను సర్దుబాటు చేసిందన్నారు. మిగిలిన 3,797 మందికి ఉద్యోగాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, కాంగ్రెస్‌ప్రభుత్వ నియామకపత్రాలు అందజేయాలని కోరారు. నాయకులు సాగర్, సయ్యద్ మమసాహిద్, ప్రశాంత్, బాపు, పొన్నాల ప్రశాంత్, సైదాల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో ఎమ్మెల్యేలు విఫలం



సమావేశంలో మాట్లాడు తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యే విఫలమయ్యారని, ప్రజలను మోసం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చార్జ్‌షీట్ విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి యేడాది గడిచినా ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. రైతులకు, మహిళలకు, నిరుద్యోగ యువతకు, వృద్ధులకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టిస్తూ అల్లర్లను ప్రేరేపిస్తున్నారన్నారు. వ్యాపారస్తులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మంచిర్యాలలో టూటౌన్ రైల్వే వంతెన వంద రోజుల్లో, ఎల్లంపల్లి భూనిర్వాసితుల పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య గోదావరిపై వంతెనకు బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు ప్రారంభిస్తే ఎమ్మెల్యే కమీషన్ కోసం ఆ కాంట్రాక్టు రద్దు చేయడంతో రెండు జిల్లాల ప్రజలు రవాణా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎన్నికల సమయంలో 40వేల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసి అతని కొడుకుకు ఉద్యోగం ఇచ్చాడన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని పేర్కొన్నారు. ఇలా ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, రజనీష్ జైన్, ఆరుముళ్ల పోశం, పట్టి వెంకటకృష్ణ, గుండ ప్రభాకర్, అమురాజుల శ్రీదేవి, ఆకుల అశోక్ వర్ధన్, కృష్ణమూర్తి, తిరుపతి, రమేష్, సంతోష్, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా యువజన క్రీడ అధికారి కీర్తి రాజ్‌వీరు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోటీలపై డీఈవో యాదయ్య, ఒలింపిక్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు.

రాజ్‌వీరు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సీఎం కప్ 2024లో భాగంగా ఈ నెల 7,8 తేదీల్లో గ్రామస్థాయి, 10 నుంచి 12వరకు మండల, 16 నుంచి 21వరకు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి డిసెంబరు 27 నుంచి జనవరి 2వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఒలింపిక్ వైస్ ప్రెసిడెంట్ రమేష్, కబడ్డీ కార్యదర్శి రాంచందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, పీడీలు, అధికారులు , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా యువజన క్రీడ అధికారి కీర్తి రాజ్‌వీరు

అంబేద్కర్ చూపిన బాటలో నడవాలి

దండేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ కొల్లూరి రవికుమార్ అన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కులరహిత సమాజం కోసం అంబేద్కర్ కృషి చేశాడన్నారు. గ్రామ గ్రామాన అంబేద్కర్ యువజన సంఘం సభ్యత్వం చేపట్టాలన్నారు. బొమ్మెన మహేష్, అక్కల సురేష్ చేతుల మీదుగా అధ్యక్ష కార్యదర్శులకు సభ్యత్వం అందజేశారు. రాజశేఖర్, దూడ సాయికుమార్, మంతెన నవీన్, ప్రశాంత్, రమేష్, పాల్గొన్నారు.

బాల మల్లేష్ మృతి తీరని లోటు



బాల మల్లేష్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నస్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి నక్క బాల మల్లేష్ అకాల మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్ అన్నారు. నర్సయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మన్ మాట్లాడుతూ ప్రజల, విద్యార్థుల, రైతుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుగ్గా పాల్గొన్నారని, ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, రేగుంట చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు మిర్యాల రాజేశ్వర్ రావు, మొగిలి లక్ష్మన్, లచ్చిరెడ్డి, బాకం శంకర్, జోగుల అంజనేయులు, ఎండి రషీద్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నస్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. అంతకు ముందుగా నాయకులు ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలను విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. కేజీబీవీ హాస్టల్ పాఠశాల విద్యార్థులకు మెస్ కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వస్తోందని హెచ్చరించారు. పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి సంద్ర తిరుపతి, నాయకులు కార్తీక్, విజయ్, రాహుల్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మనోహర్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

క్రైం కార్నర్

మూడో అంతస్తు నుంచి దూకి వివాహిత ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఏసీసీ కృష్ణానగర్‌లో కడుపునొప్పి భరించలేక ఆయిల్ల రోహిణి (24) వివాహిత సోమవారం తెల్లవారుజామున మూడో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కృష్ణానగర్‌కు చెందిన అయిల్ల శ్రీనివాస్-హేమలత కుమార్తె రోహిణికి బెల్లంపల్లిలోని బూడిదగడ్డబస్తీకి చెందిన గొడిసెల ప్రేమ్‌కుమార్‌తో మూడు నెలల క్రితం వివాహమైంది. రోహిణి కొద్దిరోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. గత నెల 27న భర్తతో కలిసి తల్లిగారింటికి వచ్చింది. తెల్లవారుజామున మూడో అంతస్తు పైకి ఎక్కి కిందకు దూకింది. నిద్రలో ఉన్న భర్త ప్రేమ్‌కుమార్ శబ్దం విని చూసేసరికి రోహిణి కిందపడి ఉంది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రాములు తెలిపారు.

మైనర్ బాలికను వేధించిన వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఓ మైనర్ బాలికను వేధించిన కేసులో సుబ్బారావుపల్లికి చెందిన రాస వెంకటేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. వెంకటేష్ రెండు నెలలుగా పాఠశాలకు వెళ్తున్న బాలికను ప్రేమించమని వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. మూడు రోజుల క్రితం బైక్ ఎక్కమని చేయి పట్టుకుని లాగి అసభ్యంగా ప్రవర్తించడంతో ప్రతిఘటించి వెళ్లిపోతున్న క్రమంలో ఇంట్లో వాళ్లకు చెబితే చంపుతానని బెదిరించాడు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారి ఫిర్యాదుమేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బస్టాండు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఓల్డు కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ జీవన్(32) బైక్‌పై బస్టాండు నుంచి వెళ్లుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో జీవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. వ్యాన్ డ్రైవర్ రంగన్నపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్రీయ రహదారి రైల్వేగేటు రోడ్డు వద్ద సోమవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో పట్టణానికి చెందిన వాసు, భరత్‌లు గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడిన వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఇందు గార్డెన్ సమీపంలో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అఖిల్ అనే యువకుడు గాయపడ్డాడు. మంచిర్యాలకు వెళ్తుండగా వెనక నుంచి బస్సు ఢీకొట్టడంతో గాయాలుపాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు వాహనం(టీఎస్12టీ 1515)లో అక్రమంగా తరలిస్తున్న 9ఆవులను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలి పారు. వాంకిడి మండలం గోయగాంకు చెందిన వ్యాన్ డ్రైవర్ సద్దాం సర్ఫుద్దీన్ షేక్, మహారాష్ట్ర చంద్రాపూర్ చెందిన బోడ మంగేష్ నర్సింహ, కాగజ్‌నగర్‌కు చెందిన అజీమ్ షాదుల్లాషేక్, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్‌రియాజ్ ఖురేషిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వేధిస్తున్న కూలీల కొరత

- పంట చేలలోనే ఉన్న పత్తి
- వాతావరణ పరిస్థితులపై రైతుల్లో ఆందోళన
- పులి దాడులతో మరింత జంకుతున్న కూలీలు





చేనులలో ఉన్న ఏరివేతకు సిద్ధంగా ఉన్న పత్తి

తిర్యాణి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలో ఎక్కువ మంది రైతులు ఈసంవత్సరం పత్తిసాగు వైపే మొగ్గు చూపారు. దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతోపాటు ఇటీవల పత్తి తీయడానికి కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుండడంతో అన్నదాతలు అయోమయంలోపడ్డారు. మండలంలో కూలీల కొరత ఉండడంతో పక్కనున్న మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొచ్చి కిలోకు రూ.10 చొప్పున చెల్లిస్తున్నారు. అయినప్పటికీ పత్తి చేలలోనే కిందపడి పోతుండడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మహా రాష్ట్ర నుంచి కూలీలను తరలించడానికి అనేక వ్యయ ప్రయాసాల కోర్చుకుని ట్రాన్స్‌పోర్టుతోపాటు వారికి గ్రామంలో మకాం ఏర్పాటు చేసి పత్తి తీసేందుకు వెళ్తున్నారు. కాగా తిర్యాణి మండలంలో అత్యల్పంగా నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలతో పాటు ఇటీవల అక్కడక్కడ పులి దాడులు అధికమవుతుండడంతో కూలీలు, రైతులు బెంబేలెత్తి పోతున్నారు. కాగజ్ నగర్, సిర్పూర్(టి)మండలాల్లో పులిదాడుల నేపథ్యంలో పత్తితీయడానికి కూలీలు జంకుతు న్నారు. గతనెలలో దేవాపూర్ (కాసిపేట) శివారు నుంచి తిర్యాణి మండలంలోని ఏదులపహాడ్ వైపు పులి సంచరిస్తోందని అటవీఅధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేశారు. ఇటీవల వేర్వేరు మండలాల్లో వరుసగా పులి దాడులు చేస్తున్న నేపథ్యంలో తిర్యాణి అడవుల్లో సైతం సంచరిస్తుందేమోనన్న అనుమానంతో కూలీలు పత్తి ఏరివేతకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

వాతావరణ శాఖ వెలువరించిన నివేదిక ప్రకారం రానున్న మూడురోజులు వర్షాలు కురు స్తాయని తెలపడంతో పాటు మండలంలో ఆకాశం మేఘావృతమై ఉండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిపంట ఇప్పటి వరకు కూలీల కొరతతో చేలలోనే ఉండిపోయిందని ఇప్పుడు పత్తి తీసే సమయంలో మూలిగే నక్కపైన తాటి పండు పండిందన్న సామెతలాగా ఓ వైపు పులిదాడుల భయం, మరోవైపు వాతావరణ ప్రభావం వెరసి నష్టాలను చవి చూడాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సమయానికి పత్తి ఏరకుంటే వర్షంతో నష్టం వస్తుందని మండలంలోని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అటవీఅధికారులు స్పందించి గ్రామాల్లో రైతులకు, కూలీలకు అవగాహన కల్పించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వరికోతల దిగులు..

- చేతికి వచ్చిన వరి...అరకొర యంత్రాలతో రైతులకు అవస్థలు
- హార్వెస్టర్‌లు, కూలీల కొరత

బెల్లంపల్లి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించి పంట కోతకు వచ్చిన దశలో కూలీలు, హార్వెస్టర్ కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ఒకేసారి వరి పంట కోతకు రావడంతో యంత్రాలకు, కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో హార్వెస్టర్‌లకు గిరాకీ పెరిగింది. హార్వెస్టర్ ఫోర్ వీలర్ చైన్ మిషన్ గంటకు రూ. 3 వేల నుంచి రూ. 3500ల వరకు తీసుకుంటుండగా టైర్లతో ఉన్న హార్వెస్టర్ గంటకు రూ. 2 వేల నుంచి 2500ల చొప్పున తీసుకుంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ. 500 నుంచి 700 రేటు పెరగడంతో అదనంగా ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. బురద ఉన్న పొలాల్లో చైన్ మిషన్‌కు గంటకు మరో రూ.500 అదనంగా తీసుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి హార్వెస్టర్‌లు రాకపోవడంతో కొరత ఏర్పడుతుం దని రైతులు తెలుపుతున్నారు.


కూలీల కొరత అధికంగా ఉంది..



పత్తి ఏరివేతకు కూలీల కొరత వేధిస్తోంది. స్థానికంగా కూలీలు దొరకక పోవడంతో పక్కన మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకు వచ్చి పత్తిని ఏరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కూలీలకు కిలో పత్తికి రూ.10 చొప్పున చెల్లిస్తున్నా స్థానికంగా కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది.

- ఆత్రం వినోద్, రైతు, చింతపల్లి

వర్షం వస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది..



పత్తి చేలలోనే పత్తి ఏరకపోతే వర్షం వస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. స్థానికంగా కూలీల కొరతతోపాటు మరోవైపు పులి దాడి నేపథ్యంలో పత్తి ఏరడానికి కూలీలు జంకు తున్నారు. ఒకవైపు వర్షాలు వచ్చే పరిస్థితులు నెలకొనడంతో ఏమి చేయాలో తోచడం లేదు.

- కుడ్మెత రాము, రైతు, గంగాపూర్

10 రోజులుగా ఎదురు చూశా..



చేతికి వచ్చిన వరి పంట కోయాలంటే హార్వెస్టర్‌లు లభించక పోవడంతో 10 రోజులుగా ఎదురు చూశాను. గత ఏడాదికి ఈ ఏడాదికి రేట్లు అదనంగా తీసుకుంటు న్నారు. హార్వెస్టర్‌ల కొరతతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పత్తి, వరి ఒకేసారి చేతికి రావడంతో కూలీల కొరత ఏర్పడుతుంది.

- రాజన్న, రైతు

న్యూస్ బాక్స్

కళాజాతా

తిర్యాణి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మండలంలో కళాజాతా ప్రదర్శనద్వారాఅవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్య ప్రకాష్, ఎంపీడీవో మల్లేష్‌పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాలకు సిద్ధం

ఆసిఫాబాద్‌రూరల్: నేడు కలెక్టరేట్‌లో నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల వేడుకల నిర్వహణకు అంతా సిద్ధం చేసినట్లు జిల్లా మహిళాశిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖాధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకులాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ఆసిఫాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందని బీఆర్‌ఎస్‌వీ ఇన్‌చార్జి ముస్తఫా అన్నారు. గురుకులాల సందర్శన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రావణ్, శ్రీకాంత్,ప్రవీణ్, సాగర్‌పాల్గొన్నారు.

డాటా ఎంట్రీని వేగంగా పూర్తిచేయాలి

కెరమెరి: డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుబ సర్వే డాటాఎంట్రీని పరిశీలించారు.

గ్రామాల్లో అవగాహన

ఆసిఫాబాద్ రూరల్: రానున్న వేసవిలో అడవిలో నిప్పు వెలిగించకూడదని అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఫారెస్టుబీట్ అధికారులు సాధిక్, వెంకటేష్ ప్రజలకు అవగాహన కల్పించారు.

వేగం వద్దు.. ప్రాణం ముద్దు

లింగాపూర్: వేగంవద్దు ప్రాణం ముద్దు అని లింగాపూర్ ఎస్సై గంగన్న అన్నారు. సోమవారం మండలంలో ఆయన వాహనాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలను వేగంగా నడిపి అమూల్యమైన ప్రాణాలను పోగొ ట్టుకోవద్దన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

బెజ్జూరు: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణ చెత్తతో అస్తవ్యస్థంగా మారింది. ఆదివారం వారసంత నిర్వహించగా వ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేసి మిగిలిన చెత్తను వదిలిపెట్టారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు చెత్తను తొలగించక పోవడంతో బస్టాండు ప్రాంతం పూర్తిగా చెత్తతో నిండిపోయింది. దీంతో గ్రామస్థులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చింతలమానేపల్లి: మండలంలోని పలుగ్రామాల్లో లబ్ధిదారులకు బుధవారం బాలాజీ అనుకోడ రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ మునావర్‌షరీఫ్ అన్నారు. లబ్ధి దారుల తల్లి ఆధార్‌కార్డు, అకౌంట్‌బుక్ జీరాక్స్ తీసుకుని రావాలన్నారు.

రైతులకు ఆర్థికసహాయం అందజేత

పెంచికలపేట: మండలంలోని ధరోగపల్లి గ్రామంలో పులిదాడిలో రైతు వరిమడ్ల శ్రీనివాస్‌కు చెందిన గేదె మృతిచెందగా సోమవారం ఎఫ్‌ఆర్వో అనీల్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తక్షణ ఆర్థికసాయం కింద రైతుకు రూ.5వేలు అందజేశారు. అనంతరం ఎస్సై కొమురయ్యతోకలిసి గ్రామంలో అవగాహన కల్పించారు.

మధ్యాహ్న భోజనం రుచి చూడాలి

దహెగాం: ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు రుచి చూడాలని తహసీల్దార్ కవిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వపాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజనం వండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట పాత్రలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ యూనియన్ అథ్లెటిక్స్ పోటీల్లో శార్వాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. 300 మీటర్ల పరుగు పందెంలో శశాంక్ వెండి పతకం, బాల్ త్రోయింగ్‌లో అశ్విని వెండి పతకం, లాంగ్‌జంప్‌లో అవిఘ్న కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీజన్, స్వామి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

బెల్లంపల్లి/తాండూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నియోజకవర్గంలో సోమవారం టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. దాసరి శ్రీనివాస్ టీడీపీలో చేరగా ఆయనకు నాయకులు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్‌ను టీడీపీ మండల ఇన్‌చార్జిగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణిరాంసింగ్ నియమించారు. గంగాధర్, మల్లయ్య, నారాయణ, సాయిరాజ్, రాణి, సాగర్, సోహెల్, మహేందర్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా రవినాయక్



కాసిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా బానోత్ రవినాయక్ నియమితులయ్యారు. సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్ సోమవారం రవినాయక్‌కు నియామక పత్రం అందించారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు జిల్లా కమిటీకి రవినాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు అవగాహన

జన్నారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపేట, గోండుగూడ, అల్లినగర్, దొంగపల్లి గ్రామాల్లోని ప్రజలకు అటవీ శాఖ అధికారులు ఫైర్ ప్రొటెక్షన్, అడవుల సంరక్షణపై సూచించారు. ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు మాట్లాడుతూ అడవిని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్యప్రాణులను వేటాడవద్దన్నారు. సంతోష్, బోజ్యానాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడికి సన్మానం



అబ్దుల్ అజీజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తవక్కళ్ పాఠశాలలో సోమవారం ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తవక్కళ్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను ముస్లింమైనార్టీ నాయకులు సన్మానించారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితోపాటు ట్రస్మా బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. జావేద్‌ఖాన్, ఇసాక్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ఘన స్వాగతం

శ్రీరాంపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ చెందిన బోడ రామకృష్ణ, ఖమ్మం ఐలయ్య అయ్యప్ప భక్తులకు సోమవారం స్థానికులు స్వాగతం పలికారు. అక్టోబర్ 22న శబరిమలైకి పాదయాత్రగా 1600 కిలోమీటర్లు 47 రోజులపాటు వెళ్ళి స్వామిని దర్శించుకొని తిరిగి వచ్చారు.

బుగ్గ దేవాలయంలో భక్తుల సందడి

బెల్లంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామంలోని రాజరాజేశ్వర బుగ్గ దేవాలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆలయ సిబ్బంది అన్నదానం నిర్వహించారు.

గురుకుల విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది

కాగజ్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీఆర్‌ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావు అన్నారు. సోమవారం గురుకుల హాస్టళ్లను సందర్శించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం విద్యార్థులకు వసతులు, భోజనం కల్పించటంలో విఫలమైనట్టు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాలమేరకు గురుకుల బాట చేపట్టినట్టు తెలిపారు.

చివరి రోజు భక్తజన హోరు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌటాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీకేతేశ్వర కంకాలమ్మ ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న జాతరల్లో చివరిరోజు సోమవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం జాతర ఉత్సవంలో వేలాదిగా తరలిరాగా సోమవారం సైతం భక్తుల తాకిడి భారీగా ఉంది. అమ్మవారిని దర్శించుకునేం దుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు చైర్మన్ సుల్వ కనయ్య ప్రత్యేక ఏర్పాటు చేశారు.

వాంకిడి పరిసర ప్రాంతాల్లో పులి సంచారం

వాంకిడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీప ప్రాంతంలోని చేన్లలో సోమవారం ఉదయం పులి సంచరించడంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం ఇటన్‌కార్ తుకారం అనే రైతు తన పత్తిచేనులో పురుగుల మందు స్ప్రేచేస్తుండగా అకస్మాత్తుగా అతడికి పులి తారసపడింది. గమనించిన రైతు పరుగులు తీసి సమీప రైతులకు, స్నేహితులకు సమాచారం అందించాడు. ఈ విషయం అటవీశాఖ సిబ్బందికి తెలియజేయడంతో వారు తుకారాం చేనులోని పులి తారాసపడిన సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పులి సంచరిస్తున్న ప్రాంతంలో అడుగులను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తక్కళ్లపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి..

రెబ్బెన: మండలంలోని తక్కళ్లపల్లి అటవీప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులు కూడా ధ్రువీకరించారు. అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాలైన తక్కళ్లపల్లి, రోళ్లపాడు, గంగాపూర్, నంబాల గ్రామాల ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



రియాజ్ అహ్మద్‌ను వెంటనే విడుదల చేయాలి

శ్రీరాంపూర్/జైపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంఎస్‌రాష్ట్రఅధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ ప్రధానకార్యదర్శి విక్రమ్ కుమార్, ఉపాధ్యక్షుడు చిప్పకుర్తి సంపత్, హెచ్‌ఎంఎస్ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి సోమవారం విడుదల చేసిన రెండువేర్వేరు ప్రకటనల్లో కోరారు. కాంగ్రెస్‌ప్రభుత్వం గత ఎన్నికల్లో సింగరేణి కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించి నందుకు అరెస్టుచేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమఅరెస్టులు చేస్తే మూల్యం చెల్లించక తప్పదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికవిధానాలను అవలం భించినందుకే గోలేటినుంచి కొత్తగూడెంవరకు ఒక్క బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గెలవకుండా సింగరేణి కార్మికలోకం తీర్పునిచ్చిందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధితెచ్చుకుని బొగ్గుఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సాయికృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నవీన్‌చారి, రిక్కులసంతోష్‌రెడ్డినర్సింహారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

తమను విమర్శించే స్థాయి ఇతర సంఘాలకు లేదు

మందమర్రి టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఇటీవల జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికుల సమస్యలను పరిష్కరించామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొన్ని సంఘాలు తమ యూనియన్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, తమను విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్మికులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తామన్నారు. సమస్యలను సాధించినందుకు యూనియన్ అధ్యక్షుడిని బ్రాంచి కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులతో ఉద్యోగుల్లో పోటీతత్వం

శ్రీరాంపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తే పోటీతత్వం పెరుగుతుందని ఆర్కే5,6 గ్రూపుఏజెంట్ శ్రీధర్ అన్నారు. నవంబరులో అధికఉత్పత్తి సాధించిన ఉద్యోగులను ఆర్కే5గనిపై సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గత ఆరు నెలలకంటే మెరుగైన ఓఎంఎస్ 1.04సాధించినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. మేనేజర్ సుధీర్ కుమార్ ఝా మాట్లాడుతూ, నవంబరులో 94 శాతం ఉత్పత్తి సాధించామని, ఏ రిలే ఉద్యోగులు అధిక ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి రాందాస్, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, సహాయమేనేజర్ శివయ్య, పిట్‌కార్యదర్శి నరింగారావు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఇంజనీర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్కే6 గనిలో పనిచేసి శ్రీరాంపూర్ ఓసీపీకి బదిలీపై వెళ్తున్న ఇంజనీర్ రుద్రారపు మహేశ్‌ను గనిమేనేజర్ తిరుపతి, ఉద్యోగులు సోమవారం గని ఆవరణలో సన్మానించారు. పదేళ్లలో ఆయన ఆర్కే6 గనికి ఎంతో సేవచేశారని కొనియాడారు. అనంతరం ఆయనను గుర్తింపు సంఘం, ఇతర యూనియన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీసంఘాల నాయకులు, అన్ని విభాగాల ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, పిట్‌కార్యదర్శి సంపదానందం, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 135శాతం బొగ్గు ఉత్పత్తి: జీఎం శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో నవంబరులో 135శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 3.39లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్టు వివరించారు. ఏరియా వ్యాప్తంగా ఇప్పటివరకు 21,80,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 19,78,000 టన్నుల ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యాను అధికమించటానికి సమష్టిగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, ఐఈడీ బెహరా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పత్రాల అందజేత

రెబ్బెన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్ కాస్టులో సోమవారం పదోన్నతి పొందిన కార్మికులకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, గని మేనేజర్ జరుపుల శంకర్ చేతుల మీదుగా పదోన్నతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నాగుల వేణు, సహాయకార్యదర్శి ఓదెలు, సుధాకర్, ఖాసింఖాన్, రాజు, నాయకులు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు సిద్ధం

5వ పేజీ తరువాయి..

పప్పు దినుసులను దిగుమతి చేసుకోక తప్పడం లేదు. కంది మినహా మినుము, పెసర, శనగలాంటి పప్పు దినుసుల సాగు సమయం తక్కువే. పెట్టుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. కాని వాణిజ్య పంట లతో పోల్చుకుంటే రైతులకు లాభాలు తక్కువగా వస్తుడటంతో పప్పు దినుసుల సాగుపై మొగ్గు చూపడం లేదు. యాసంగిలో పప్పు దినుసుల సాగు విస్తీర్ణం పెంచేందుకు బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కేవీకే వారు గిరిజన రైతులకు ఉచితంగా పప్పు దినుసుల విత్తనాలు అందజేసి సాగును ప్రోత్సహిస్తున్నారు.

● విత్తన వరిపై ఆసక్తి...

ఒప్పంద సేద్యం వైపు రైతులు మొగ్గు చూపిస్తున్నారు. ప్రైవేటు కంపెనీ లతో బైబ్యాక్ ఒప్పందంతో సాగు చేసే విత్తన వరితో గతేడాది లాభాలు పొందారు. ఈ సారి కూడా ఆడమగ వడ్లు సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులు ఆడ, మగ విత్తనాలు వేర్వేరుగా నారు పోసుకు న్నారు. కంపెనీ వారే విత్తనాలు అందించి, యాజమాన్య పద్ధతులు సూచి స్తారు. గతేడాది జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఆడమగ వడ్లు సాగు కాగా ఈ ఏడు మరో 5 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. సాధా రణ వరి కంటే ఈ సాగు భిన్నంగా ఉంటుంది. విత్తనోత్పత్తిలో భాగంగా ఆడమగ వరసలు వేసి సంకరీకరణ (క్రాసింగ్) చేసి విత్తనం పండిస్తారు. హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి విధానంలో విత్తనాలు అంద జేయడంతో పాటు నాట్లు వేయడం, ఎరువులు, పురుగుల మందులు, కోతలు అన్ని కంపెనీ ప్రతినిధులు సలహాలు అందిస్తుండటంతో సాగు లాభదాయకంగా మారు తుందని రైతులంటున్నారు.

సరైన సమయంలో తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరానికి 15 నుంచి 18 క్వింటాళ్ల సంకర విత్తన దిగుబడి వస్తుం ది. ఈ ఆడరకం వరి గింజలను ముందుగా ఒప్పందం చేసుకున్నట్లుగానే కంపెనీలు క్వింటాలుకు రూ.7వేల నుంచి రూ.7500ల వరకు కొనుగోలు చేస్తాయి. మగ ధాన్యాన్ని సాధారణ దొడ్డు రకాలుగా మార్కెట్లో అమ్ముకోవడంతో మరింత ఆదాయం వస్తున్నది. సాధారణ వరి సాగు కంటే విత్త నోత్పత్తి వరి సాగులో లాభా లు ఎక్కువగా ఉంటున్నాయని రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రీడాకారులతో కలిసి పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

కోటపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. సోమవారం కొండంపేట గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలో వెళ్లకుండా సత్ప్రవర్తన కలిగి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులకు సివిల్ సప్లై మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, చెన్నమల్ల చైతన్య గడ్డం ప్రశాంత్‌లు దుస్తులు అందించారు. విజేతలకు నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు ప్రశాంత్, రాజేందర్, మహేష్, సందీప్, రాజేష్‌లు తెలిపారు.

ఆరుపదుల వయస్సులో అలుపెరగకుండా..

- 2014లో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు
- ఆరోగ్యంపై శ్రద్ధ... పలు సేవా కార్యక్రమాలు



తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బెల్లంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరు పదుల వయస్సు దాటగానే ఇక రిలాక్స్‌గా ఫీలవుతారు... కాలక్షేపం చేస్తూ ఉండి పోతారు... కానీ బెల్లంపల్లికి చెందిన పలువు రు రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు సామాజిక సేవా కార్య క్రమాలు చేపడుతున్నారు. సమాజ హితం కోసం తమ వంతు కృషి చేస్తూ పలువురికి అండగా నిలుస్తున్నారు.

బెల్లంపల్లి పట్టణానికి చెందిన రత్నం రాజన్న, ముత్తె వెంకన్న, నాగేష్‌లు తిలక్ మైదానంలో వాకింగ్ చేసేవారు. అసోసియేషన్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో 2014లో మైదానం పేరుతోనే తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేష న్‌ను ప్రారంభించారు. ముగ్గురితో ప్రారంభమైన అసోసి యేషన్ ప్రస్తుతం 120 మందితో సమాజ సేవ చేస్తు న్నారు. సింగరేణి, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ విర మణ పొంది సమాజ హితం కోసం కృషి చేస్తున్నారు. కలిసికట్టుగా నిర్ణయం తీసుకుని ముందుకు వెళుతున్నారు.

సామాజిక కార్యక్రమాలు చేపడుతూ అండగా ఉంటూ..

తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతో మందికి అండగా ఉంటున్నారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ప్రతీ ఆదివారం 300ల మందికి పైగా కూలీలకు అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. కాసిపేట, వేమనపల్లి మండలాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలంలోని గిరి జనులకు దుప్పట్లు, దుస్తులు, సరుకులు పంపిణీ చేస్తున్నా రు. కానిస్టేబుల్ ఉద్యోగ సాధన కోసం మైదానానికి వచ్చే యువకులకు పండ్లు, ఉడకబెట్టిన కోడిగుడ్లు, రాగిజావ అందజేస్తున్నారు. ఒంటరి మహిళలకు, నిరుపేద కుటుం బాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వారి వృత్తు లకు సంబంధించిన పనిముట్లు, పరికరాలను అందిస్తూ బాసట గా నిలుస్తున్నారు. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం, ఎంబీబీఎస్‌తోపాటు వివిధ రంగాల్లో సీట్లు వచ్చిన వారి ఆర్థిక పరిస్థితి బాగా లేక చదువుకు దూరమయ్యే వారికి సహాయం అందిస్తున్నారు. పట్టణంలో ఎవరైనా మృతి చెందితే ఫ్రీజర్‌లు అందిస్తున్నారు. నిరు పేదలను గుర్తించి దుప్పట్లను పంపిణీ చేస్తున్నారు. యేటా వేసవిలో రోజు అంబలి పంపిణీ చేస్తున్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ సమాజ సేవలో

తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారి ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ మరో వైపు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆరు పదుల వయస్సులో అనారోగ్యాల బారిన పడతామని రోజు వాకింగ్, యోగా చేస్తున్నారు. అప్పు డప్పుడు విహార యాత్రలకు వెళ్తున్నారు. వీరందరు ఉత్సాహంగా ఉండడం కోసం నృత్యాలు చేస్తుంటారు.





గిరిజనులకు దుప్పట్లు పంపిణీ, చదువు కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి
రత్నం రాజం, తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు



మేమందరం అసోసియేషన్‌గా ఏర్పడి మా శక్తి మేరకు సమాజ సేవ చేస్తున్నాం. మానవ సేవ చేయడం సభ్యులందరికి సం తృప్తినిస్తుంది. సభ్యులమందరం ఐక్యంగా సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తున్నాం. ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తుండడంతో మానసిక ఉల్లాసం లభిస్తుంది.

అండగా నిలుస్తున్నాం
రంగ రామన్న, తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు



అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్య క్రమాలు చేపడుతూ ముందుకు వెళ్త న్నాం. సభ్యులందరు ఐక్యంగా నిర్ణయాలు తీసుకుని సేవా కార్యక్రమాలు చేపడుతు న్నాం. నిరుపేదలకు, విద్యార్థులకు, కూలీ లకు మా వంతు సహాయం చేస్తూ అం డగా నిలుస్తున్నందుకు ఆనందంగా ఉంది.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం : గెల్లి జయరాంయాదవ్, సీనియర్ సభ్యుడు



రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్య క్రమాలు చేపడుతూ ముందుకు వెళ్తాం. ముగ్గురితో ప్రారంభమై 120 మంది సభ్యులతో కొనసాగుతున్నాం. మేము చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రజలు, దాతలు సహకరిస్తున్నారు. ఎవరికైనా ఆర్థిక సహాయం కావాలన్నా గిరిజనులకు దుప్పట్లు, దుస్తులు కావాలన్నా మాకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. దీంతో మేమందరం వారికి అవసరం ఉన్న సరుకులతో పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భీమారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గతంలో రుణాలు తీసు కుని చెల్లించని బకాయిదారులు వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకో వాలని ఎస్‌బీఐ మేనేజర్ సుబ్బారెడ్డి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని రుణ విముక్తులు కావా లని సూచించారు. పంట రుణాలు పొం దిన రైతులు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

నెన్నెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలి పారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై తనిఖీ నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. నవంబరు 25 నుంచి ఈ నెల 2 వరకు ప్రత్యేక బృందాలు పర్యటించి తనిఖీలు చేపట్టాయని పేర్కొ న్నారు. అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయాలి

తాండూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : తాండూర్ పంచాయతీలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ చిరం జీవి, నాయకుడు శంకర్‌లు ఎంపీడీవో, తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రాలు అందించారు. గ్రామపంచా యతీకి మూడు కిలోమీటర్ల దూరంలో మీసేవ కేంద్రం ఉం డడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీకి సమీపం లో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

బెల్లంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల జాతీయ రహదారి పక్కన సర్వే నెంబరు 112లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడా లను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ జ్యోత్స్న ఆధ్వ ర్యంలో రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మి స్తే కూల్చివేస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు

భీమిని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చర్య లు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ అన్నారు. బిట్టూరుపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం బోరుబావికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మల్లీడి, వెంకటాపూర్, వీగాం, పెద్దపేట గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో బోరుబావులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాజీ సర్పంచు గడ్డం ఎల్లాగౌడ్, రాంటెంకి దశరథం, సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

బెల్లంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో రోడ్డు డివైడర్ల మధ్యలో ఉన్న కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ సోమవారం ఒక ప్రక టనలో డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

జన్నారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పునరుత్పాదక ఇంధనశక్తి వన రులు అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో గెడెం సందేశ్, అక్కల నితీష్‌లు ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థులను ఎంఈ వో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయ సంఘాల నాయ కులు కమలాకర్, రాజన్న, బాపు, నర్స య్య, ప్రకాష్, గైడ్‌టీచర్లు రాజన్న, లిం గయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

కోటపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ విజ్ఞాన మేళాలో అన్నారం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్ తెలిపారు. విద్యార్థులు చరణ్‌తేజ్, శ్రావణ్‌కుమార్‌తో పాటు గైడ్ టీచర్ సురేందర్‌ను అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఈవో యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబులు అభినందించారు.

పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

దండేపల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఆల్ ఇం డియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా కన్వీనర్ కొల్లూరి రవికుమార్, మహేష్, అక్కల సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

భీమారం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): ఎల్కేశ్వరంలో సోమవారం పశు వైద్యాధికారి రాకేశ్ శర్మ ఉచిత గర్భకోశ చికిత్స అవగాహన శిబిరాన్ని నిర్వహిం చారు. కృత్రిమ గర్భధారణ వల్ల కలిగే లాభాలను వివరించారు. 40 పశువులకు చికిత్స చేశామని పేర్కొన్నారు. గోపాల మిత్ర సూపర్ వైజర్ రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



గెలుపొందిన జట్టుతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో గత నెల 29 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొంది. సెమీఫైనల్‌లో రంగారెడ్డి టీమ్‌తో తలపడి 17-05 గోల్స్‌తో గెలుపొంది, ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుతో హోరాహోరీగా తలపడి 21-14 గోల్స్‌తో గెలుపొంది ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొందని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్‌లు తెలిపారు. క్రీడాకారులను, కోచ్ సునర్కర్ అరవింద్, మేనేజర్ గోగర్ల సాయిలను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి అలుగువెల్లి రమేష్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరి ఫణిరాజా, కరాటే కార్యదర్శి మహేష్, టీడబ్ల్యూ స్పోర్ట్స్ ఆఫీసర్ మీనా రెడ్డి, క్రీడా సంఘాలు, కోచ్‌లు కళ్యాణ్, శేఖర్, సీనియర్ క్రీడాకారులు ప్రవీణ్, కార్తీక్, పీఈటీ, పీడీలు అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీక రించారు. నస్పూర్, చెన్నూరు, దండేపల్లి, బెల్లంపల్లి, మందమర్రి, కన్నెపల్లి మండలాల నుంచి ప్రజలు దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. మంచిర్యాల, బెల్లం పల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలు పాల్గొన్నారు.

మైత్రి ట్రాన్స్ జెండర్ క్లీనిక్ ప్రారంభం



క్లీనిక్ ప్రారంభోత్సవంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, పాల్గొన్న అధికారులు, నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ జెండర్ క్లీనిక్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ క్లీనిక్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు వైద్యం, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయి. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ సల్ల మహేష్, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రరెడ్డి, డెమో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

హాస్టల్ ఎదుట బీఆర్‌ఎస్‌వీ నాయకుల ఆందోళన

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైనార్టీ హాస్టల్‌ను సం దర్శించడానికి సోమవారం బీఆర్‌ఎస్‌వీ, బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లగా హాస్టల్ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు హాస్టల్ ఎదుట ఆందోళన నిర్వ హించారు. వారు మాట్లాడుతూ గురుకులాల్లో జరుగుతున్న వరుస ఫుడ్‌పాయి జన్‌లను దృష్టిలో ఉంచుకుని సందర్శించడానికి వెళితే అడ్డుకోవడం సరైంది కాదన్నారు. యండి నాయబ్, రవీందర్,మహేందర్, సతీష్, పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్‌వీ నాయకులు సందర్శించారు. నాయకులు విద్యార్థులను సమస్యలను తెలుసుకు న్నారు. భోజనం, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. బడికెల శ్రావణ్, చైతన్య, అరుణ్, రోషన్, అఖిల్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా మనోవికాస్

- దివ్యాంగుల సేవలో సింగరేణి యాజమాన్యం
- సొంత పిల్లల్లా చూసుకుంటున్న ఉపాధ్యాయులు, ఆయాలు
- స్టేషనరీ తయారీలో దిట్ట
- నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ వేషధారణలో దివ్యాంగ విద్యార్థులు

మందమర్రి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో మానసిక దివ్యాంగులైన వారిని చూసి బాధ పడే తల్లిదండ్రులకు మందమర్రిలోని మనో వికాస్ మా నసిక దివ్యాంగుల పాఠశాల అండగా నిలుస్తోంది. 2001లో పాఠశాలను సింగరేణి యాజమాన్యం ఏర్పా టు చేసింది. పుట్టుకతో దివ్యాంగులు అయిన వారికి చేయూతనివ్వాలనే సంకల్పంతో పాఠశాలను ప్రారం భించింది. మొదట్లో వంద మందికి పైగా విద్యను అభ్యసించారు. ప్రస్తుతం పాఠశాలలో 45 మందికి పైగా ఉన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బస్సు లలో పాఠశాలకు చేరవేసి ఇంటికి తీసుకెళ్తుంది. వీరికి ప్రత్యేకంగా ఇద్దరు ఆయాలను నియమించి జీత భత్యాలను అందిస్తోంది.

సింగరేణి అధికారులు, ఉద్యోగుల విరాళాలు..

మానసిక దివ్యాంగులకు సింగరేణి అధికారులతో పాటు కార్మికులు ప్రతీ నెల వారి వేతనా ల నుంచి తోచినంత విరాళాలను అంద జేస్తోంది. కొందరు ఉద్యోగులు, అధికారులు వారి వేతనాల నుంచి కూడా రికవరీ చేయిస్తు న్నారు. ప్రత్యేకించి పాఠశాలకు నిధులు బ్యాం కులో నిల్వ చేసి ఉపాధ్యాయులకు యాజమాన్యం చెల్లిస్తోంది. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధు లు నేర్పడంతోపాటు వారి కాళ్లపై వారు నిలబడే విధంగా ప్రోత్సహిస్తున్నారు.

స్టేషనరీలో శిక్షణ

మనోవికాస్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు చెందిన విద్యార్థులు స్టేషనరీ తయారీలో ముందున్నా రు. కవర్లు, నోట్ బుక్స్, ఫైల్ ప్యాడ్స్, ఫైల్ టాగ్స్ తయారు చేస్తున్నారు. వీరు తయారు చేసిన వాటిని సింగరేణితో పాటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకు లభించడం వల్ల గిరాకీ ఉంది. పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు సా ధించారు. పాఠశాలకు వచ్చిన తర్వాత విద్యాబోధనతో పాటు స్టేషనరీ తయారీకి శిక్షణ ఇస్తున్నారు.

పాఠశాలకు ప్రత్యేక ఏర్పాట్లు....

పాఠశాలకు వచ్చే మానసిక దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలను ఏ ర్పాటు చేసింది. పాఠశాల ముందు ర్యాంపు ఏర్పాటు చేసింది. వారి తరగతి గదులకు పక్కనే మూత్ర శాల లు ఏర్పాటు చేసింది. వారు భోజనాలు చేసేందుకు వీలుగా టేబుల్స్ సౌకర్యం కల్పించారు. పాఠశాల ఆవ రణలో ఒక స్టేజిని ఏర్పాటు చేసింది. వారు ఆడుకు నేందుకు వీలుగా క్రీడామైదానం కూడా సమకూర్చారు.

తల్లిదండ్రులకు ఊరట....

మానసిక వికలాంగులు పుట్టారని బాధపడే పిల్లల కు పాఠశాల ఏర్పాటుతో ఊరట లభించింది. ఇంటి వద్ద పిల్లల ప్రవర్తనతో విసుగు చెందిన తల్లి దండ్రులు పాఠశాలలో చేర్పించిన తర్వాత వారిలో వచ్చిన మార్పు లను చూసి ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం వారి పనులు వారు చేసుకోవడంతో సంతోషపడుతున్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

సొంత పిల్లల్లా భావిస్తాం...
మంజులవాణి, ఉపాధ్యాయురాలు



విద్యార్థులను సొంత పిల్లల్లా భావిస్తాం. విద్యా బోధన చేయడంతో పాటు సమాజంలో మంచి చెడులను నేర్పిస్తాం. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు వారు మానసిక వికలాంగులు అనే విషయాన్ని మర్చిపోయే విధంగా అందరిలా ఉండేలా కృషి చేస్తున్నాం. పాఠశాలలో చదువు తున్న విద్యా ర్థులను చూస్తుంటే ఎంతో ఆనందంగా కలుగుతుంది. వారికి సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

పిల్లల్లో మంచి మార్పు..
సురేఖ, ఉపాధ్యాయురాలు



పాఠశాలకు వస్తున్న మానసిక వికలాంగుల్లో చాలా మార్పులు వచ్చాయి. విద్యా బోధన కూడా అర్థం చేసుకుంటున్నారు. స్టేషనరీ తయారీలో ఒకసారి చెబితే అదే పద్ధతిలో అనుసరిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుం టున్నారు. మానసిక విక లాంగులు ఉన్నారని బాధపడే తల్లిదండ్రులకు తమ పాఠశాల కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.



పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జిల్లా కేంద్రంలో జరగబోయే గాండ్ల తెలికుల ఆరాధ్యదైవం, సంతాజీ జగ్నడే మహారాజ్ జయంతి పోస్టర్లను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ దోత్రే చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో గాండ్ల తెలి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, శ్రీనివాస్, ఆకాష్, మురళీకృష్ణ, సంతోష్, పోచన్న, ఆనంద్‌రావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పట్ల పోలీసు స్టేషన్ సీఐలు, ఎస్సైలు తక్షణమే స్పందించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటిపైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి సేవల్ని వినియోగించుకోవాలన్నారు.

బాధితులకు అండగా 'భరోసా' సెంటర్

బాధిత మహిళలు, పిల్లలకు అండగా ఉండడానికే భరోసా సెంటర్ ప్రారంభించామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. లైంగికదాడికి గురైన మహిళలకు, బాలికలకు అండగా భరోసా సిబ్బంది పనిచేస్తారని అన్నారు. ఇప్పటివరకు భరోసా సెంటర్‌కు 20కేసులు వచ్చాయని అన్నారు. అందులో 15పోక్సో చట్టం కింద నమోదు అయ్యాయని, అయిదు రేప్‌కేసులు వచ్చాయన్నారు. 20కేసులలో 13మంది బాదితురాళ్ల ఇళ్లకు వెళ్లివారి ఆరోగ్యపరిస్థితి, ఆర్థికపరిస్థితి తెలుసుకున్నామన్నారు. ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే 8712670561 ద్వారా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు



మాట్లాడుతున్న విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేకదృష్టి సారించిందని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు అన్నారు. సోమవారం తననివాసంలో ఆయన మాట్లాడుతూ విద్యకు పెద్దఎత్తున ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఇటీవల గురుకులాల్లో జరుగుతున్న సంఘటనల వెనక కుట్రలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చరణ్, బాలేశ్వర్‌గౌడ్, అసద్, వసంత్‌రావు, కలీం, భాస్కర్, దినకర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 5నుంచి 12వరకు జమ్మూ కాశ్మీర్‌లో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన మధుప్రియ, ఆర్తి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. ఈ సందర్భంగా కోచ్‌లు రవికుమార్, పీఈటీలు, సిబ్బంది అభినందించారు.

వీఆర్ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవో నెం.81 ప్రకారం 61సంవత్సరాలు పైబడినవీఆర్ఏల వారసులకు ఉద్యోగఅవకాశాలు కల్పించాలని సీఐటీయూ నాయకుడు రాజేందర్ డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీ మేరకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏలు స్వరూప, అజ్గర్‌అలీ, రజినీకాంత్, రాజయ్య, ప్రియాంక, అనిత, సతీష్, కిశోర్, అంకుల్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలి

● జిల్లా యువజన క్రీడల అధికారిణి రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి: సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని జిల్లా యువజన క్రీడాధికారిణి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7నుంచి 9వరకు గ్రామపంచాయతీ స్థాయి, 10నుంచి 12వరకు మండల స్థాయి, 16నుంచి21వరకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడా పోటీలోల ఆసక్తిగల వారు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసు కోవాలన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంపీడీవో

వాంకిడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తనిఖీచేశారు. వంటగది, స్టాక్‌రూం, డార్మెటరీ, సరుకుల రిజిస్టర్, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

వంకమద్దిలో పత్తి దగ్ధం

లింగాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమద్దిలో గ్రామంలో ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం అయిన సంఘటన చోటు చేసుకుంది. వంకమద్ది గ్రామానికి చెందిన మానోత్ తిరుపతి ఇంట్లో పత్తి నిల్వ ఉంచాడు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా నిల్వఉంచిన పత్తిలో మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈలోపే దాదాపు పదిక్వింటాళ్ల పత్తి పుర్తిగా కాలి పోయిందని రైతు తిరుపతి ఆవేదనతో తెలిపాడు.

ప్రతి పనిలో వారే.. పట్టించుకునే వారు లేరే..

- అరకొర జీతాలతో కుటుంబ పోషణ
- దిక్కుతోచని స్థితిలో పంచాయతీ కార్మికులు
- ప్రస్తుత ప్రభుత్వమైనా ఆదుకోవాలని వేడుకోలు



వాంకిడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామపరిపాలనలో పంచాయతీ కార్మికులు ఎంతో కీలకం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు పల్లెల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు కానీ పంచాయతీ కార్మికుల జీవితాల్లో మార్పు రావడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని పట్టించుకున్న దాఖలాలులేవు. నెలనెల వేతనాలు రాక అప్పులు చేసి జీవనం కొనసాగిస్తున్న పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదిస్తున్నారు. నెలకు రూ.9500 జీతంతో ఏళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్నా.. ఉద్యోగ భద్రత లేదని కొత్త ప్రభుత్వం తమను ఆదుకోవాలని కారోబార్లు, పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

జిల్లాలోని 15మండలాల పరిధిలోని 335 గ్రామపంచాయతీలో 1103మంది దాదాపు 20ఏళ్లకు పైగా కారోబార్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ బల్బులు అమర్చుటకు, మంచినీరు విడుదల చేయడానికి, ఇంటిపన్ను వసూలు చేయడానికి, గ్రామంలో ఊడ్చడం, మురికికాలువలు శుభ్రపర్చడం, ఎక్కడైనా చెత్త, దుర్గంధం ఉన్నా జంతువు చనిపోయి కంపు కొడుతున్నా తీసివేసే పనులను వీరు చేస్తున్నారు. కానీ ఇందుకు సరిపడ వేతనం మాత్రం అందుకోవడంలేదు. గ్రామాల్లో పన్నులు, బిల్లులు వసూళ్ల ఆధారంగా నెలకు రూ.9500 వేతనంగా చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు కూడా నెలనెలా కాకుండా మూడునెలలకు ఒకసారి ఇస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఎప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుందన్న ఆశతోనే వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఒత్తిడితో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత, కనీసవేతనాల కోసం ఏళ్లుగా ఉద్యమిస్తూనే ఉన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఏ అధికారి పర్యటనకు వచ్చినా, మరేచిన్న పనికైనా వీరు తప్పక ఉండాల్సిందే. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా ఈ వేతనాలతో కుటుంబ పోషణ చేయడం ఎలాసాధ్యపడుతుందని కార్మికులు వాపోతున్నారు. ఆశావర్కర్లకు, ఇతర శాఖల సిబ్బందికి వేతనాలు పెంచుతున్న ప్రభుత్వం తమ గురించి పట్టించుకోకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇరవై ఏళ్ల నుంచి పంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించి వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

హామీఇచ్చారు.. అమలు మరిచారు..

గత ఏడాది పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెచేపట్టారు. ఉవ్వెత్తున సమ్మె కొనసాగడంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అప్పటి ప్రభుత్వం దశలవారీగా కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో చర్చలు జరిపి కొన్ని సమస్యలకు పరిష్కారం చూపింది. కార్మికుడు చనిపోయిన తర్వాత దహన సంస్కారాలకు రూ.10వేల నగదును పంచాయతీ నుంచి ఇవ్వాలని, రూ.5లక్షల బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. మరికొన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా.. అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

పనికితగ్గ వేతనాలు ఇవ్వాలి..

- శంకర్, కార్మిక సంఘం మండల కోశాధికారి



20 ఏళ్లుగా విధుల్లో ఉన్నాం. వచ్చేవేతనం మాత్రం రూ.9500 దాటదు. జీతాలు కుటుంబాల పోషణకు ఏమాత్రం సరిపోవడంలేదు. సమాన పనికి సమానవేతనంతో నెలకు రూ.21వేలు చెల్లించాలి. నేటికాలంలో రోజువారి కూలీ చేస్తేనే సుమారు రూ. 500నుంచి రూ.1000వరకు ఇస్తున్నారు. మాకు ఆ పరిస్థితి లేదు. ఇబ్బందులను ఎవరికి చెప్పుకున్నా హామీలు గుప్పిస్తున్నారే తప్ప నెరవేర్చడం లేదు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కాగజ్‌నగర్‌లో అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చింతలమానేపల్లి మండలం బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన జగ్గయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లికి చెందిన పీతాంబర్ తన తల్లిపేరిట ఉన్న పట్టాభూమిని ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని దరఖాస్తు అందజేశారు. తిర్యాణిమండలం రొంపల్లికి చెందిన కొలాం గిరిజనులు తమకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం రాజురా గ్రామానికి చెందిన బుచ్చయ్య తనకు రుణమాఫీ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. లింగాపూర్‌కు చెందిన మనీషా తనకు ఉన్నత చదువుల కొరకు ల్యాప్‌టాప్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. తిర్యాణి మండలం నాయకపుగూడ గ్రామానికి చెందిన లక్ష్మి తనభర్త పేరిట ఏదులపాడ్ శివారులో ఉన్న పట్టాభూమిని ఇతరులు అక్రమంగా తమపేరిట మార్చుకున్నారని దానిని రద్దు చేసి తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. జైనూరు మండలం జన్నుగూడ గ్రామానికిచెందిన అనసూయబాయి తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి గ్రామానికి చెందిన లావణ్య తాను పదవ తరగతి చదువు తున్నానని చెవిటి, మూగ వైకల్యం కలిగిఉన్నానని తన సదరం ధ్రువపత్రాన్ని పునరుద్ధరించాలని దరఖాస్తు అందజేశారు.

కాగజ్‌నగర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో దరఖాస్తుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. వివిధశాఖల్లో పెండింగ్‌లోఉన్న పనులను పూర్తిచేయాలన్నారు. సోమవారం నిర్వ హించిన ప్రజావాణిలో 13దరఖాస్తులు వచ్చినట్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం డేవిడ్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎం డేవిడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్‌దోత్రేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది అదనపు కలెక్టర్ డేవిడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కాగా డేవిడ్ ఇంతకుముందు మహబూబాబాద్ జిల్లా అదనపుకలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

పెండింగ్ డబ్బులు చెల్లిస్తేనే కొత్త సర్వేలు చేస్తాం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డబ్బులను చెల్లిస్తేనే కొత్త సర్వేలు చేస్తామని ఆశా కార్యకర్తలు పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్‌వోకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తరువాతే కొత్తసర్వేలను ప్రారంభిస్తామన్నారు. గతంలో నిర్వహించిన పల్స్‌పోలియో డబ్బులు ప్రభుత్వం నేటికీ చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, కృష్ణమాచారి, స్వరూప, పద్మ, నవీన్, వాణి, లలిత, సురేఖ, దేవి ఉన్నారు.

అడవికి నిప్పు.. వన్యప్రాణులకు ముప్పు

లింగాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు వన్యప్రాణులకు ముప్పు అని జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, జోడేఘాట్ రేంజ్ ఎఫ్ఆర్‌వో జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో మండల ప్రజలకు అడవులు, వన్యప్రాణుల సంరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులను రక్షించడం మనందరి బాధ్యత అన్నారు. వన్యప్రాణులను వేటాడడానికి ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై గంగన్న, ఎఫ్ఎస్‌వో అనుష, భగవంత్‌రావు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న అటవీ అధికారులు

పులిపై వదంతులను నమ్మవద్దు

● జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్



మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్

సిర్పూర్(టి), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గ్రామస్థులు పులి సంచారంపై వచ్చే వదంతులను నమ్మ వద్దని జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి), కాగజ్‌నగర్ అటవీప్రాంతాల్లో పులికోసం డ్రోన్‌కెమెరాలతో విస్తృతంగా తనిఖీచేపడుతున్నట్లు తెలిపారు. మండలాల్లో కొంతమంది పులిఉందని పుకార్లు లేపుతున్నారని వాటిని ఎవరు కూడా నమ్మవద్దన్నారు. గత ఆదివారం తమ పరిశీలనలో ఆడపులి మహారాష్ట్రకు వెళ్లిందని తేలిందని, మగపులి- మాలిని, మెట్‌పల్లి, రావన్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తపడాలన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు.

గ్రామాల్లో పులి సంచారంపై అవగాహన

దహెగాం/చింతలమానేపల్లి/కెరమెరి: మండలాల్లో, గ్రామాల్లో అటవీఅధికారులు సోమవారం పులి సంచారంపై అవగాహన కల్పించారు. భయాందోళనకు గురికావద్దని పులిగురించి ఏమైనా సమాచారం తెలిస్తే అటవీఅధికారులకు తెలియజేయాలన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న చేనులలో రైతులు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. గుంపులుగా అటవీ ప్రాంతాలకు వెళ్లాలని, ఒకరిద్దరు వెళ్లరాదన్నారు. అటవీ ప్రాంతంలో నిశ్శబ్దంగా ఉండకుండా చప్పుడు చేయాలన్నారు.

అటవీశాఖ అసమర్థత వల్లే పులి దాడులు: ఎమ్మెల్యే హరీష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అధికారు అసమర్థత వల్లే పులి దాడులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. ఫారెస్టు అధికారుల దృష్టి ఎంతసేపూ అక్రమ సంపాదన మీదనే తప్ప పులుల సంరక్షణ మీద లేదన్నారు. పులిదాడిలో మనుషులు చనిపోవటం ముమ్మాటికి అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. గన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి మృతిచెందటం దురదృష్టకరమన్నారు. పులులకు రేడియో కాలరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే వాటిని ట్రాక్ చేయటం సులభమవుతుందన్నారు. మహారాష్ట్ర విధానాన్ని అనుసరించాలని సూచించారు. రాబోయే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈవిషయాన్ని ప్రస్తావిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి దోని శ్రీశైలం, ఈర్లవిశ్వేశ్వర్‌రావు, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే.

నాలుగురోజులక్రితం పులిదాడిలో మృతిచెందిన గన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్యే హరీష్‌బాబు పరామర్శించారు. ఈసందర్భంగా దాడిజరిగిన తీరును తెలుసుకున్నారు. లక్ష్మి కుటుంబసభ్యులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మాజీసర్పంచి దోతుల శ్రీనివాస్, శేఖర్, రవీందర్ తదితరులున్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్



రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టర్ నేషనల్ హైవే మేనేజర్ రంజన్‌కుమార్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి నేషనల్ హైవేను పరిశీలించారు. ఈ ఒదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవే నుంచి పట్టణానికి వచ్చే రహదారి మూలమలుపు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మూలమలుపు వద్ద ఉన్న ప్రాంతాన్ని చదును చేసి రోడ్డువిస్తరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. భారత్ పెట్రోల్‌పంపు సమీపంలో ఉన్న యూటర్న్‌ను మూసివేయించాలని ఆదేశించారు. సాయిబాబా ఆలయ సమీపం నుంచి నేషనల్ హైవే వరకు అప్రోచ్‌రోడ్డుకు బీటీ వేయాలని సూచించారు. రోడ్డు వెడల్పులో సమాధులు కోల్పోతుండడంతో వారి పేరున మొక్కలు నాటాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీకరుణాకర్, మున్సిపల్ కమీషనర్ భుజంగరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

● ప్రజలకు మరింత చేరువలో మెరుగైన వైద్యం

జిల్లాప్రజలకు మరింతచేరువలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్‌లను ప్రారంభించిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లోని బుద్ధ పూర్ణిమ రోడ్డు వద్ద రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 108నూతన అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించడంతో పాటు రాష్ట్రంలో 16నర్సింగ్, 28పారామెడికల్ కళాశాలలు, 33జిల్లాలో జిల్లాకు ఒకటి చొప్పున మైత్రిట్రాన్స్ క్లినిక్‌లను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆడిటోరియంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా జిల్లాకు నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్‌ను మంజూరు చేసిందన్నారు. అనంతరం నర్సింగ్‌కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాం, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీలక్ష్మి, పద్మలత, లత తదితరులు పాల్గొన్నారు.